


# కరపత్రం

SINCE 2014


శుక్రవారం ఏప్రిల్ 17, 2026 సంపుటి : 2 సంచిక : 186 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

## ♦ ఇందులో ఎలాంటి రాజకీయం లేదు

## ♦ 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు

» వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
» చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
» ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
» ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
» దీనిని విస్మరించే వారిని మహిళలు క్షమించరు
» ఉత్తరాది, దక్షిణ్యాది అంటూ విభజన తేవద్దు
» డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
» మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ,ఏప్రిల్16 :** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు. మహిళా రిజర్వేషన్ ప్రక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు.

2లో..

# తెలంగాణలో 17 నుంచి 26కు ఎంపిల సంఖ్య

- ఎపిలో 25 నుంచి 38కి పెరుగుదల
- డీలిమిటేషన్‌పై హోంమంత్రి అమిత్ షా వెల్లడి
- దక్షిణాదికి అన్యాయం జరగదని వివరణ



**న్యూఢిల్లీ,ఏప్రిల్16 :** డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఇది కావాలని చేస్తున్న ప్రచారంగా తిప్పికొట్టారు. ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయన్నారు. తెలంగాణలో 17 నుంచి 26కు పెరుగుతాయని చెప్పారు. కర్ణాటకలో 28 నుంచి 42కు, తమిళనాడులో 39 నుంచి 59కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయని చెప్పారు. దక్షిణాది జనాభా శాతం కంటే ఎక్కువ సీట్లు పెరుగుతాయని పేర్కొన్నారు. విపక్షాలు అవాస్తవాలు చెబుతూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ సంబంధిత బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్ షా ఈ వివరాలు వెల్లడించారు. జనాభా గణన ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, కుల గణన నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని , ప్రస్తుతం గృహ గణన పనులు జరుగుతున్నాయని, జనాభా గణన జరిగినప్పుడు కుల గణన కూడా చేర్చుతామని ఆయన చెప్పారు. మత ఆధారిత రిజర్వేషన్ల ఆలోచనను అమిత్ షా తిరస్కరించారు. మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఆమోదయోగ్యం కాదని, మతం ఆధారంగా ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన చెప్పారు. రాజ్యాంగంలో అలాంటి అవకాశం లేదన్నారు. అఖిలేష్ యాదవ్ డిమాండ్లపై విమర్శలు చేస్తూ.. అఖిలేష్ యాదవ్ తన పార్టీ టికెట్లన్నీ ముస్లిం మహిళలకు ఇవ్వొచ్చని, ఆయన పార్టీకి ఎలాంటి సమస్యల ఉండదని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు.

### జనగణనలో వివరాలు నమోదు చేసిన చంద్రబాబు

# ప్రజలు అంతా జనగణనలో పాల్గొనాలని పిలుపు

**అమరావతి,ఏప్రిల్16 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వీయ జనగణనలో తన వివరాలను నమోదు చేసుకున్నారు. జనగణన పక్రియలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. హౌస్ లిస్టింగ్-హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్ లైన్ ద్వారా వివరాల నమోదు పక్రియ గురువారం ప్రారంభమైంది. వెబ్ సైట్ ద్వారా ముఖ్యమంత్రి వివరాలను నమోదు చేసుకున్నారు.



2లో..

### మహిళా బిల్లు, పునర్విభజనపై

# మొసలి కన్నీళ్లు

» డిఎంకె తీరుపై మండిపడ్డ బిజెపి ఎంపి తేజస్వీ సూర్య
» రేవంత్ హైబ్రీడ్ మోడల్‌పైనా ఆగ్రహం
» కాంగ్రెస్ తీరుపై మండిపడుతూ..ఎపి విభజనపై వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్16 :** లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లుపై జరుగుతున్న చర్చ సందర్భంగా కర్ణాటకకు చెందిన బీజేపీ యువ ఎంపీ తేజస్వి సూర్య విపక్షాలపై, ప్రధానంగా డీఎంకే పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అలాగే తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి హైబ్రీడ్ మోడల్‌పైనా విమర్శలు గుప్పించారు. పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందంటూ డీఎంకే చేస్తున్న వాదనలను ఆయన 'మొసలి కన్నీళ్లు'గా అభివర్ణించారు. 'ప్రతి పౌరుడి ఓటుకు సమాన విలువ ఉండాలన్నది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానాల కేటాయింపు జరగడం ప్రజాస్వామ్య సూత్రం' అని తేజస్వి సూర్య పేర్కొన్నారు. డీఎంకే వంటి పార్టీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాది-దక్షిణాది విభజనను సృష్టించాలని చూస్తున్నాయని ఆయన ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల సీట్లు తగ్గుతాయనే ఆందోళనలను ఆయన తోసిపుచ్చారు.



2లో..



2లో

# తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

» వెంటనే క్షమాపణలు చెప్పాల్సిందే
» దీనిపై బిజెపి ఎంపిలు నోరు మెదపరా
» జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపాటు

**హైదరాబాద్,ఏప్రిల్16 :** తెలంగాణ ఉద్యమాన్ని ఇండియా-పాకిస్థాన్ విభజనతో పోల్చడంపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. మిస్టర్ తేజస్వీ సూర్య.. తెలంగాణ ప్రజల 6 దశాబ్దాల ఆకాంక్ష అంటే నీకు అంత చులకనా? ఎంత ధైర్యం ఉంటే ఇక్కడి పోరాటాన్ని అంతలా కించపరుస్తావు?

# మండుతున్న ఎండలు..

## తెలంగాణలో పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్



మిగతాది 2లో

**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు, రేపు ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు.



2లో..

# మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

- ప్రధాని మోడీ మొదలు తేజస్వీ వరకు అందరిదీ అదేతీరు
- మండిపడ్డ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్,ఏప్రిల్16 :** పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై భారతీయ జనతా పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, ఆ పార్టీ నేతలకు తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకార పూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.



# తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే

- బేషరతుగా ఆయన క్షమాపణలు చెప్పాలి
- మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్

**హైదరాబాద్,ఏప్రిల్16 :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పార్లమెంట్ వేదికగా నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్య వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

- ఉత్తరాది దక్షిణాది అంటూ విభజన రేఖలు
- మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



2లో..

**హైదరాబాద్,ఏప్రిల్16** కాంగ్రెస్ మరోసారి దేశ విభజనకు కుట్రలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావుఆరోపించారు. సౌత్, నార్త్ అంటూ కాంగ్రెస్ పెద్ద కుట్ర చేస్తోందన్నారు. డీలిమిటేషన్‌పై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు పార్టీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు.గతంలో మహిళా బిల్లు అమలు చేయాలన్న రాహుల్‌గాంధీ.. ఇప్పుడెందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం లేదని స్పష్టం చేశారు. నార్త్‌లో కాంగ్రెస్ పోయిందని.. త్వరలో సౌత్‌లో కూడా పోతుందంటూ వ్యాఖ్యానించారు. రేవంత్ ట్రాప్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రజలు పడరని.. సౌత్ ప్రజలు తెలివైన వారన్నారు. రేవంత్ రెడ్డి నార్త్ సౌత్ డివిజన్ రాజకీయాలు చేస్తున్నారంటూ టీబీజేపీ చీఫ్ మండిపడ్డారు. రీజినల్ పార్టీలు మాట్లాడుతున్నాయంటే ఏదో అనుకోవచ్చు.. కానీ కాంగ్రెస్ లాంటి జాతీయ పార్టీ ఇలాంటి మాటలు మాట్లాడటం సరికాదని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచందర్ రావు పేర్కొన్నారు.

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

మొదటిపేజీ తరువాయి

మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు.

ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

## మండుతున్న ఎండలు..

మొదటిపేజీ తరువాయి

రానున్న మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపి ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.నేటి నుంచి మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం అవకాశం ఉందని పేర్కొంది.

## మరోమారు బిజెపి తెలంగాణ వ్యతిరేకత

మొదటిపేజీ తరువాయి

బీజేపీ నాయకులు పదే పదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమర వీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. స్వయంగా ప్రధానమంత్రి మోదీ నుంచి మొదలుకొని ఈరోజు పార్లమెంట్ సభ్యుడు తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరు తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. తెలంగాణ ఏర్పాటు పైన విషం కక్కుతూ బీజేపీ చేస్తున్న వ్యాఖ్యలను తెలంగాణ సమాజం గుర్తు పెట్టుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అనేది ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పోరాటం, వేలాది మంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్యబద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టు కుందని విమర్శించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా, అక్కడే ఉన్న ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం తెలంగాణ నుంచి ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎంపీలు సైతం బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణం అన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు, ప్రజలకు ఏ ముఖం పెట్టుకుని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఎంపీల వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు బీజేపీ పార్టీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని , లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

## తేజస్వీ వ్యాఖ్యలు తెలంగాణను అవమానించడమే

మొదటిపేజీ తరువాయి

దశాబ్దాల పోరాటం, వేలాది మంది యువతీ యువకుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణను, రక్తపాతంతో కూడిన దేశ విభజనతో పోల్చడం అమరవీరుల త్యాగాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇవాళ బీఆర్ఎస్ ఎంపీలే గనుక సభలో ఉండి ఉంటే తేజస్వి సూర్య సంగతి తేల్చిపారేసేవారని హరీష్‌రావు అన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ రాజ్యాంగబద్ధంగా జరిగిందని గుర్తుచేసిన హరీశ్ రావు.. ఈ రాష్ట్రం నేడు దేశానికే ఆదర్శంగా నిలవడాన్ని బీజేపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఒకవేళ తెలంగాణ ఏర్పాటు భారత్-పాక్ విభజన వంటిదే అయితే, ఆనాడు పార్లమెంట్‌లో బీజేపీ ఈ బిల్లుకు ఎందుకు మద్దతు ఇచ్చిందని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ కూడా రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు తేజస్వి సూర్య అదేబాటలో నడుస్తూ విషం చిమ్ముతున్నారని హరీష్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మౌనాన్ని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి, ఢిల్లీ పెద్దల ముందు రాష్ట్ర గౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడిచేసే శక్తులను ఇక్కడి ప్రజలు ఎన్నడూ క్షమించరని, త్యాగాల చరిత్రను అగౌరవపరిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

## డీలిమిటేషన్‌పై కుట్ర రాజకీయాలు

మొదటిపేజీ తరువాయి

కేరళ కంటే తెలంగాణ జనాభా ఎక్కువ. కేరళలో 20 ఎంపీ సీట్లు ఉంటే.. తెలంగాణలో 17 మాత్రమే ఉన్నాయి. సీఎం రేవంత్ ముందు కేరళలో సీట్లు తగ్గించమని కోరాలి. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా జనాభా ఉన్న రాష్ట్రాల్లో తక్కువ సీట్లు ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ చేయాలని రాహుల్ గాంధీ కొత్త పార్లమెంట్ భవనంలోనే కోరారు. ఇప్పుడు 543 సీట్లలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల జనాభా తగ్గింది.. ఉత్తరాదిన పాటించలేదని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి వితండ వాదం చేస్తున్నారు. జీఎస్‌డీపీ మీద సీట్లు పెంచమనడం సరైంది కాదు. లోక్‌సభలో పెప్పర్ స్ప్రే చేయాలనే ప్లాన్‌లో కాంగ్రెస్ ఉంది. రాహుల్ గాంధీకి మించి రేవంత్ జాతీయ నాయకుడిగా ఎదుగుతున్నారు. రాహుల్ గాంధీకి సబ్జెక్ట్ తెలియక మాట్లాడటం లేదా? రేవంత్‌కు సబ్జెక్ట్ ఎక్కువ ఉండి మాట్లాడుతున్నారా? డీలిమిటేషన్‌ను ముందు వ్యతిరేకించింది స్టాలిన్. రేవంత్‌రెడ్డి మాత్రమే దక్షిణాది, ఉత్తరాది అని వైషమ్యాలు సృష్టిస్తున్నారు. తెలంగాణలో 50 శాతం సీట్లు పెరిగితే.. యూపీలో 50 శాతం పెరుగుతాయి. దక్షిణాదిలో సీట్లు గతంలోనే తగ్గాయి.. ఇప్పుడు తగ్గుతున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన కుల గణన సక్రమంగా జరగలేదు. మా గల్లీలో ఎవరి ఇంటికీ ఎన్యూమరేటర్ రాలేదు. ఉత్తరాదిలో కాంగ్రెస్ లేదు.. దక్షిణాదిలో కూడా పోతుంది. దక్షిణాదిలో కాంగ్రెస్ కంటే భాజపాకే ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్నాయి. దేశంలో ఎప్పుడూ ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల్లో లబ్ధి పొందడానికే అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల తర్వాత పెడితే యూపీ ఎన్నికలు అంటారు.. ఆ తర్వాత పెడితే తెలంగాణ ఎన్నికలు అంటారు. అందుకే వన్ నేషన్ వన్ ఎలక్షన్ వస్తే మంచిదని రామచందర్ రావు అన్నారు.

### మహిళా బిల్లు, పునర్విభజనపై

## మొసలి కన్నీళ్లు

మొదటిపేజీ తరువాయి

'ప్రధాని మోదీ నాయకత్వంలో ఏ ఒక్క రాష్ట్రానికీ అన్యాయం జరగదు. మొత్తం సీట్ల సంఖ్య పెరగడం వల్ల అన్ని ప్రాంతాలకు ప్రాతినిధ్యం మెరుగుపడుతుందే తప్ప తగ్గదని ఆయన స్పష్టం చేశారు. కేవలం భయాందోళనలు సృష్టించడం ద్వారా మహిళా రిజర్వేషన్ల అమలును అడ్డుకోవాలని డీఎంకే ప్రయత్నిస్తోందని విమర్శించారు. గతంలో మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలతో డీఎంకే జట్టు కట్టిందని, ఇప్పుడు మహిళల కోసం మాట్లాడుతుండటం హాస్యాస్పదమని ఆయన ఎద్దేవా చేశారు. 2029 నాటికి మహిళలకు 33 శాతం కోటాను అమలు చేయాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని అడ్డుకోవడానికి డీఎంకే కుంటి సాకులు వెతుకుతోందని మండిపడ్డారు.పునర్విభజన అనేది జనాభా గణాంకాల ప్రకారం జరిగే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, దీనిని రాజకీయ కోణంలో చూడటం సరికాదని తేజస్వి సూర్య తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. ఈ బిల్లుల ద్వారా భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో మహిళలకు సరైన గౌరవం లభిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇకపోతే తెలంగాణ సిఎం హైబ్రిడ్ మోడల్‌ను ఆయన ఫూలిష్ ఆర్యగుమెంట్‌గా అభివర్ణించారు. జిఎస్‌డిపి అంటూ చేసిన వ్యాఖ్యలు సరికావన్నారు. ఇది రాజ్యాంగం ప్రకారం చెల్లదని అన్నారు. అలాగే తెలంగాణ ఏర్పాటుపై బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వివాదాస్పద కామెంట్స్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ను పాకిస్తాన్ తో పోల్చారు. బ్రిటీష్ వారి కంటే చెత్తగా ఏపీని విభజించారని ఆరోపించారు. భారత్ నుంచి పాకిస్తాన్ ను విడదీసినట్లుగా ఏపీని విభజించారని అన్నారు. ఇలాంటి విధానాలతో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి హైబ్రీడ్ మోడల్ అంటూ చేస్తున్న వాదనలను తిప్పి కొట్టారు. జిఎస్‌డిపి బాగా ఉన్నప్పుడు సీట్లు పెంచితే...తగ్గితే సీట్లు తగ్గించాలా అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ విధానాలే ఇలా ఉంటాయని అన్నారు.

## తెలంగాణ అంటే అంత చులకనా తేజస్వీ

మొదటిపేజీ తరువాయి

అంటూ నిప్పులు చెరిగారు. ఆరు దశాబ్దాల వివక్షకు వ్యతిరేకంగా, ఆత్మగౌరవం కోసం చేసిన ఈ మహోద్యమాన్ని తక్కువ చేసి మాట్లాడటం అజ్ఞానానికి పరాకాష్ట అని విమర్శించారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను కూడా తేజస్వీ సూర్య తన వ్యాఖ్యలతో అవమానించారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం రాజకీయ విమర్శ కాదని, తెలంగాణ అస్తిత్వంపై జరిగిన దాడి అని ఆమె అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు మాట్లాడినా సరే ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తెలంగాణ బీజేపీ ఎంపీలపై కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ సమాజాన్ని

అవమానించేలా మీ పార్టీ ఎంపీ మాట్లాడుతుంటే.. మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఈ వ్యాఖ్యలను మీరు సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. వెంటనే తేజస్వీ సూర్యతో క్షమాపణలు చెప్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే సత్తా లేకపోతే, ఎంపీలుగా కొనసాగే అర్హత మీకు లేదని, వెంటనే పదవులకు రాజీనామా చేయాలని ఘాటుగా వ్యాఖ్యానించారు.మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం కేంద్ర ప్రభుత్వ పెద్ద కుట్ర అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి, డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం కేంద్రం చేస్తోందని ఆమె విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లుపై ఢిల్లీ వేదికగా కవిత మాట్లాడుతూ.. 'మహిళ బిల్లుకు డీలిమిటేషన్ బిల్లును లింక్ చేయటం పెద్ద కుట్ర. మహిళల భుజాలపై తుపాకీ పెట్టి డీలిమిటేషన్ బిల్లును కాల్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణకు రాజకీయ ప్రాధాన్యం తగ్గిస్తే ఊరుకునేది లేదు. ఒకవేళ డీలిమిటేషన్ పేరుతో తెలంగాణ సీట్ల సంఖ్యను తగ్గిస్తే, రాష్ట్ర ప్రయోజనాల కోసం మరో ఉద్యమం తప్పదు. మహిళా రిజర్వేషన్లలో కచ్చితంగా బీసీ సబ్ కోటా ఉండాలి. అప్పుడే వెనుకబడిన వర్గాల మహిళలకు చట్టసభల్లో సరైన ప్రాతినిధ్యం దక్కుతుంది' అని అన్నారు.

## జనగణనలో వివరాలు నమోదు చేసిన చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు ప్రజలు స్వయంగా ఆన్‌లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ముఖ్యమంత్రికి తెలిపారు. మే 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించటం అవసరమని, ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఏపీలో జనగణన కార్యక్రమం జరుగుతోందని, ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని అభిప్రాయపడ్డారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరగనుందని, మొదటి దశలో ఇవాల్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రారంభమైన హౌస్ లిస్టింగ్- హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందించాలని ప్రజలను కోరారు. జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## దేశవ్యాప్తంగా మండుటెండలు అప్రమత్తంగా ఉండాలన్న ఐఎండి

దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమండుతున్నాడు. మధ్యాహ్నం బయట తిరగాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలోని చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వడగాల్పుల కారణంగా జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ ప్రజలకు కీలక సూచనలు చేసింది. వడదెబ్బలు తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పులు తీవ్రతరం అవుతున్నాయి. వడదెబ్బల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండండి. వీలైనంత ఎక్కువ నీళ్లు తాగండి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో కష్టమైన పనులు చేయకండి. లైట్ కలర్ దుస్తులు ధరించండి. తరచుగా విశ్రాంతి తీసుకుంటూ ఉండండి. వడదెబ్బ తగిలితే .. వెంటనే ఆ వ్యక్తిని చల్లని ప్రదేశానికి తరలించండి. నేలపై పడుకోబెట్టండి. నీళ్లలో తడిపిన బట్టను కప్పండి. చల్లని నీళ్లు తాగించండి. నీటి శాతం ఎక్కువగా ఉన్న ఆహారాపదార్థాలను అతడికి తినిపించండి' అని సూచించింది. ఏప్రిల్ 20వ తేదీ వరకు తెలంగాణ, రాయలసీమ, మధ్య మహారాష్ట్ర, మరాఠ్వాడా, ఉత్తర కర్ణాటక, మధ్య ప్రదేశ్, విదర్భ, ఒడిశా, జార్ఖండ్, వెస్ట్ రాజస్థాన్‌లలో అత్యంత తీవ్రంగా వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో వేడి, పొడి వాతావరణ పరిస్థితులు ఉంటాయని వెల్లడించింది.

## వడదెబ్బతో కొడుకు మృతి

**– తట్టులోలేక తల్లి మరణం**

జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అప్పటివరకు కళ్ళముందే తిరిగిన కొడుకు అనంతలోకాలకు వెళ్లగా.. ఆ వార్త విన్న తల్లి గుండె తట్టుకోలేకపోయింది. కొడుకు మరణించిన గంటల వ్యవధిలోనే తల్లి కూడా కన్నుమూసింది. ఈ ఘటన అయిజ మండలం తూముకుంట గ్రామాన్ని శోకసంద్రంలో ముంచేసింది. గ్రామానికి చెందిన కుర్వ మల్లికార్జున్ తీవ్రమైన వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయాడు. కంటిపాపలా పెంచుకున్న కొడుకు ఇక లేడన్న వార్త విన్న తల్లి కురువ రంగమ్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు మరణవార్తను ఆమె తట్టుకోలేక పోయింది. పుట్టెడు దుఃఖంతో ఆమె గుండె ఆగిపోయింది. ఒకే ఇంట్లో తల్లీకొడుకులు మృతి చెందడంతో తూముకుంట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేస్తోంది.

## మహిళా రిజర్వేషన్లు మహిళల హక్కు

- **ఎంతోకాలంగా ఈ బిల్లు పెండింగ్‌లో ఉంది**
- **గతంలో సమాజ్‌వాది పార్టీ అడ్డుకుంది**
- **మహిళలకు ఆస్తిలో సమానవాటా ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌ది**
- **బిల్లును అనవసర కారణాలతో అడ్డుకోరాదు**
- **రాజమండ్రి ఎంపి పురందేశ్వరి**

మహిళా రిజర్వేషన్ డిమాండ్ ఎప్పటి నుంచో ఉందని రాజమండ్రి లోక్‌సభ ఎంపీ పురందేశ్వరి అన్నారు. గతంలో చాలాసార్లు బిల్లు పెట్టినా సాకారం కాలేదని, అప్పట్లో సమాజ్‌వాదీ పార్టీ మద్దతివ్వలేదని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ఆమె మాట్లాడారు. రాజకీయాల్లో మహిళల పాత్ర పెరిగిందని గ్రహించాలన్నారు. ఈ బిల్లు పాస్ కావడం మహిళల దశాబ్దాల కల. 2023లో మద్దతిచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాత్రం కొర్రీలు పెడుతోంది. జనగణన పేరుతో అభ్యంతరాలు చెబుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లు మొట్టమొదట 1996లో ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ మాత్రం ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టిందని అన్నారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన నియోజకవర్గాల పునర్విభజన 131వ రాజ్యాంగ సవరణ బిల్లులపై జరిగిన చర్చలో పలు విషయాలు వెల్లడించారు. ఈ చారిత్రక బిల్లులకు పూర్తి మద్దతు ప్రకటించిన ఆమె, మహిళా రిజర్వేషన్ల అమలులో గత ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. ప్రసంగం ప్రారంభంలో ఆమె తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మహిళా సాధికారత కోసం చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే ఆస్తిలో కుమార్తెలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు, మహిళా విశ్వవిద్యాలయం, మహిళా పోలీస్ స్టేషన్ల ఏర్పాటు వంటి విప్లవాత్మక నిర్ణయాలను ఆయన తీసుకున్నారని సభకు వివరించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలు లోక్‌సభ సీట్లను కోల్పోతాయన్న ఆందోళనలపై ఆమె స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారం, లోక్‌సభ స్థానాల సంఖ్యను 50 శాతం పెంచడం వల్ల ఏ రాష్ట్రానికి ఉన్న ప్రస్తుత సీట్లు తగ్గవని భరోసా ఇచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సీట్ల పెంపు ఉండటం వల్ల రాజకీయ సమతుల్యత దెబ్బతినదని, దక్షిణాది రాష్ట్రాల గొంతు పార్లమెంట్‌లో బలంగానే ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం గతంలో తీవ్ర జాప్యం చేసిందని పురందేశ్వరి విమర్శించారు. 1996 నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ బిల్లును 2010లో రాజ్యసభ ఆమోదించినా, లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్‌కు మనసు రాలేదని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ప్రధాని మోదీ ఈ బిల్లును యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తుంటే, విపక్షాలు అనవసరపు రాజకీయ కారణాలతో అడ్డుకోవాలని చూడటం సరికాదన్నారు. మహిళా రిజర్వేషన్ల అమలు వల్ల దేశాభివృద్ధిలో మహిళలు కేవలం భాగస్వాములుగా మాత్రమే కాకుండా, నిర్ణేతలుగా మారతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# జిల్లా ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ కంటి అద్దాల పంపిణీ

- ఉష్ణోగ్రతల నుండి రక్షణకై ప్రత్యేక చర్యలు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**కరపత్రం ప్రతినిధి రాజన్న సిరిసిల్ల**
రాజన్న సిరిసిల్ల జిల్లాలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని జిల్లా పరిధిలో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ఆరోగ్య రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కార్యాలయంలో ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ కంటి అద్దాలను జిల్లా ఎస్పీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధుల నిర్వహించే సమయంలో ట్రాఫిక్, బ్లూ కోర్ట్ పోలీస్ సిబ్బంది నీరు, గ్లూకోజ్ తీసుకోవాలని, తగిన జాగ్రత్తలతో పని చేయాలని సూచించారు. అలాగే ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మోడెం సురేష్, ఆర్ఎస్ఐలు సముద్రాల రాజు, తూర్పాటి శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మూడో ర్యాంక్ సాధించిన జమ్మికుంట విద్యార్థిని హర్షిని -- ఘన సత్కారం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్ :16**



ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర స్థాయిలో మూడవ (3) ర్యాంక్ సాధించి ప్రతిభ చాటుకున్న జమ్మికుంట పట్టణానికి చెందిన శ్రీ విద్యాలయ ఆవాస విద్యాలయం విద్యార్థిని గుడికందుల హర్షిని స్థానికంగా ఘనంగా సత్కరించారు. ఆమె సాధించిన ఈ అరుదైన విజయంతో పాఠశాల, తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు గర్వం వ్యక్తం చేశారు.శ్రీ సరస్వతి శిశు మందిర్ కమిటీ సభ్యులు హర్షిని ప్రతిభను అభినందిస్తూ పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా శ్రీ సరస్వతి విద్యాపీఠాలు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాయని, అందుకే విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. హర్షిని ఇంటర్మీడియట్‌లో 470లో 467 మార్కులు సాధించడం ఆమె కృషి, పట్టుదల, గురువుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని తెలిపారు.ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి ఆకుల రాజేందర్, ప్రబంధకారిణి కార్యదర్శి దాసరి రవీందర్, బచ్చు శివకుమార్, కనుమల్ల గణపతి, దయ్యాల ప్రభాకర్, ఎక్కడి రఘుతం రెడ్డి, మెరుగు కృష్ణార్జున రావ్, ప్రధానాచార్యులు గుడికందుల సుదర్శన్ మరియు పాఠశాల ఆచార్యులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో మున్నూరు కాపు ముద్దు బిడ్డ ప్రతిభ

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 16:**



ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో యైటింక్లయిన్ కాలనీకి చెందిన ఆంధ్రస శ్రీ విన్యా పటేల్ అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. గురువారం మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విద్యా కుసుమం శ్రీవిన్యాను శాలువాతో ఘనంగా సన్మానించి షీల్డ్ అందజేసి అభినందించారు. కాలనీలో ప్రైవేట్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న లక్ష్మణ్-సుమలత దంపతుల కుమార్తె శ్రీవిన్యా టెన్త్ లో సైతం అధ్యధిక మార్కులు సాధించి ఉత్తీర్ణత సాధించింది. మొదటి నుండి విద్యలో ప్రథమ స్థానంలో రాణిస్తూ శ్రీవిన్యా ఇంటర్మీడియట్ కరీంనగర్ లోని కాకతీయ జూనియర్ కళాశాలలో ఎం.పి.సి గ్రూప్ తీసుకోని కఠోర సాధన చేసి మొదటి సంవత్సరంలో 468/470 సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. మునుముందు సైతం విద్యలో ఉత్తమంగా రాణించి మున్నూరు కాపుల కీర్తిని చాటలని సంఘ బాద్యులు ఆకాంక్షించారు. కాశెట్టి వెంకటేశం పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ బాద్యులు ఆకుల శశి కుమార్, దామసాని సూర్య ప్రకాష్ పటేల్, పడాల యాదగిరి పటేల్, నీలం రవి పటేల్, రంగిశెట్టి వెంకన్న పటేల్, రాపెల్లి కొమురయ్య పటేల్,కుడిది మహేందర్ పటేల్, దన్నాయక సంతోష్ కుమార్ పటేల్, బండ అరవింద్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ దీక్ష అయ్యప్ప దీక్ష స్వాములకు నిత్యాన్నదానం

**– కోదండ రాముల ప్రధాన అర్చకులు గోవర్ధన మధుసూదన చారి**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 16:**




స్థానిక గోదావరిఖని కోదండ రామాలయం లో గత 12 సంవత్సరాల నుంచి నిత్య అన్నదాన కార్యక్రమం దాతలచే నిర్వహిస్తున్నామని కోదండ రామాలయం ప్రధాన అర్చకులు గోవర్ధన మధుసూదన్ చారి పేర్కొన్నారు. అర్చకులు గోవర్ధన మధుసూదన చారి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి నిత్యాన్న దాన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు అంతేకాకుండా ప్రతి సంవత్సరం హనుమాన్ దీక్ష స్వాములకు అయ్యప్ప దీక్ష స్వాములకు నిత్యం అన్నప్రసాదాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు నియమనిష్ట మాల ధార వేసుకున్న స్వాముల కుటుంబాలకు ఆయు ఆరోగ్యాల అష్టైశ్వర్లతో వర్ధిల్లాలని అర్చకులు గోవర్ధన మధుసూదన్ చారి కోరుకున్నారు ఈ కార్యక్రమంలో అర్చకులు శశిధర్ చారి అయ్యగారు అధిక సంఖ్యలో మాలా దీక్ష స్వాములు పాల్గొన్నారు.

# రామగుండం ఐసీడీఎస్ లో అక్రమాల భాగోతం..

**– జిల్లా కలెక్టర్ కు టీచర్లు, ఆయాల ఫిర్యాదు**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 16:**
రామగుండం ఐసీడీఎస్ ప్రాజెక్టు అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిందనీ, సీడీపీఓ అలేఖ్య ఆగడాలు పెట్రేగిపోతున్నాయని పలువురు టీచర్లు, ఆయాలు ఆరోపించారు. ఈమేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా సంక్షేమ అధికారిని కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు టీచర్లు నాగుల మల్యాల స్వర్ణలత, మిన్హాజ్ నౌషిన్, కొండ తిరుమల, కంకణాల వెంకటరమణ తోడేటి రాజేశ్వరి తెలిపారు. ఇక్కడి ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఒక్కో పనికి ఒక్కో రేటు నిర్ణయించినట్లు తెలిపారు. సెలవు మంజూరుకు రూ.5 వేలు, బదిలీ కోసం రూ.50 వేలు, పదోన్నతి కోసం రూ.3 లక్షలు, వేసవి కాలంలో హాలీడేస్ కోసం సెంటర్ కు రూ.500, ఫంక్షన్ ఉన్నట్లయితే టీచర్





గానీ హెల్పర్ గానీ సీడీపీఓకు బట్టలు ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో మిగిలిన నిల్వ సరుకులను సీడీపీఓ తానే స్వయంగా వచ్చి తీసుకవెళ్తుంటుందనీ, సీడీపీఓ ఇంట్లో పనులకు కూడా ఆయాలు వెళ్లి చేయాల్సిందేనని, సీడీపీఓ వ్యక్తిగత రూల్స్ పాటించని వారిని ఇబ్బందులకు గురి చేస్తుందని వాపోయారు. ఇంకా ప్రతి సెంటర్ నుంచి నెలకు రూ.500 చొప్పున సీడీపీఓకు ఇవ్వాల్సిందేననీ, ఆ మొత్తంలో కొంత వాటాలను పై అధికారులకు పంపకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇందుకోసం ఓ వ్యక్తిని తన బినామీగా పెట్టుకొని ఫోన్ పే , గూగుల్ పే ద్వారా లావాదేవీలు జరుపుతున్నట్లు తెలిపారు. గత ఏడాది ఎర్రోజు వినోద అనే టీచర్ ను ట్రాన్స్ఫర్ కోసం రూ.10వేలు, మిన్హాజ్ అనే టీచర్ వద్ద ట్రాన్స్ ఫర్ కోసం రూ.10వేలు వసూలు చేసిందని ఆరోపించారు. జనగాంకు చెందిన ఆయా వద్ద స్వరూప పదోన్నతి ఇవ్వడానికి రూ.2.50 లక్షలు లంచంగా తీసుకున్నదని తెలిపారు. రాంమందిర్ కు చెందిన ఆయా రాధ వద్ద టీచర్ గా పదోన్నతి కోసం రూ.50వేలు లంచంగా తీసుకుందని ఆరోపించారు. అల్లూరుకు చెందిన ఆయా సఫియా వద్ద టీచర్ గా పదోన్నతి కోసం రూ.3లక్షలు తీసుకున్నదనీ, ఇంకా ఎంతోమంది టీచర్లు, ఆయాల వద్ద బదిలీల కోసం లంచాలు వసూలు చేసిందని ఆరోపించారు. తాజాగా ఇవన్నీ బయట పెట్టేందుకు సిద్ధమైన స్వర్ణలత అనే టీచర్ పై నిరాధారమైన ఆరోపణలు సృష్టించి అకారణంగా సస్పెన్షన్ చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే సదరు సీడీపీఓపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# 15వ ఆర్థిక సంఘం నిధులనుండి ఉప్పు లింగాపూర్ పాఠశాలకు 1,50,000 విలువగల సైన్స్ లేబరేటరీ పరికరాలను అందజేసిన

- జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వెల్దుర్తి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ రెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 16**
మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం వెల్దుర్తి మండలం ఉప్పులింగాపూర్ పాఠశాలకు గురువారం నాడు 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి ల్యాబ్‌కు 150000/- విలువగల సైన్స్ లేబరటరీ పరికరాలను కొనుగోలు చేసి అందజేసిన మెదక్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వెల్దుర్తి మండల కాంగ్రెస్ పార్టీ మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుల కు అందించడం జరిగిందని వారు తెలియజేశారు ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మాట్లాడుతూ అవసరమైన సైన్స్ పరికరాలను పంపిణీ చేసిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ పరికరాలు మా విద్యార్థులు ప్రయోగాలు చేసి, విషయాలను సులభంగా అర్థం చేసుకోవడానికి, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవడానికి ఎంతో







ఉపయోగపడతాయి. మా విద్యార్థుల ప్రజ్ఞా పాఠశాలను పెంపొందించడానికి మీరు చేసిన ఈ సహాయం నిజంగా ప్రశంసనీయ మనీ కొనియాడారు గ్రామంలోని ప్రజా ప్రతినిధులు మా పాఠశాల లో చదువుకున్నటువంటి విద్యార్థి విద్యార్థులకు చూపుతున్నటువంటి అభిమానాన్ని మునుముందు రానున్న రోజుల్లోతమ పాఠశాలపై అందరి ప్రేమ ఆప్యాయతలను చూపి విద్యార్థుల భవిష్యత్తు కోసం అందరం చేస్తే వారి భవిష్యత్తులో వారు చదువులోని కాకుండా అన్నింటిలోనూ ముందు ఉండి మన పాఠశాలకు ప్రఖ్యాతి తీసుకువచ్చే విధంగానే తాము వారిని ఏకలవ్య శిష్యులుగా తీర్చిదిద్దే ప్రయత్నం మేముమా తోటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కృషి చేస్తామని ఎల్లవేళలా గ్రామ ప్రజలు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల ప్రజా నాయకుల దీవెనలతో విద్యార్థుల భవిష్యత్తు కోసం అందరం కృషి చేసే విధంగానే ఉండాలని కోరుకుంటున్నామని వారు తెలియజేశారుఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ స్వప్న, రాజు, రజిత, చంద్రశేఖర్ ఉప్పులింగాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాదయ్య, 9వ వార్డు మెంబెర్ మోత్య,నవీన్, అశోక్, మహిపాల్, బాలరాజ్,తండా వాసులు పాల్గొన్నారు

# పేదల సంక్షేమమే ప్రజా పాలన లక్ష్యం

- వేములవాడలో ఘనంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక
- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
పేదల సంక్షేమమే ప్రజా పాలన లక్ష్యమని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. గురువారం మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్ లో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సభ ఉత్సాహంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కమిషనర్ కె.సంపత్ కుమార్ సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 99 రోజుల ప్రగతిని అధికారులు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థిని విద్యార్థులకు అల్పాహార పథకం, ఇందిర





కుటుంబ జీవిత బీమా, మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలు విద్యా, సామాజిక రంగాల్లో మార్పులు తీసుకువస్తాయని అన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లు, రోడ్ల విస్తరణకు రూ.46 కోట్లు, పట్టణ మౌలిక వసతులకు రూ.4.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ద్వారా వీల్ చైర్, అంగన్‌వాడీ కేంద్రాలకు వాటర్ ప్యూరిఫైర్లను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డీఓ రాధాభాయి, వైస్ చైర్మన్ నరాల శేఖర్, పట్టణ సిఐ వీరప్రసాద్ కౌన్సిలర్లు, కమిటీ సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# అప్రమత్తతే రక్షణ గోల్డెన్ అవర్‌లో తక్షణ స్పందన.. ప్రాణాలను కాపాడుతుంది

**– పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డిలిశ్రీ**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 16:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా గురువారం గోదావరిఖని అడ్డగుంట పల్లి ప్రాంతంలోని కెమిస్ట్ భవన్‌లో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పెద్దపల్లి డిసిపి బి.రామ్ రెడ్డి గోదావరిఖని ఎస్ పి ఎం.రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు బాధితులను ఆసుపత్రికి తరలిస్తే పోలీస్ కేసుల్లో చిక్కుకుంటామనే అపోహలు ప్రజల్లో ఉన్నాయని, అలాంటి భయాలు అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించిన వారికి రహా వీర్ పథకం క్రింద రూ.25 వేల ప్రోత్సాహకం అందజేయనున్నట్లు తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంట గోల్డెన్ అవర్‌గా ఉండి, ఈ సమయంలో సరైన వైద్యం అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని



పేర్కొన్నారు. గోల్డెన్ అవర్‌లో చికిత్స అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సమయంలో "గోల్డెన్ అవర్" ఎంతో కీలకమని, ప్రమాదం జరిగిన మొదటి గంటలో సరైన వైద్య సహాయం అందిస్తే ప్రాణాలను రక్షించవచ్చని తెలిపారు. ఈ సమయంలో మెడికల్ సిబ్బంది స్పందన, తక్షణ చికిత్స అందించడం అత్యంత అవసరమని వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రాణ నష్టం తగ్గించవచ్చని సూచించారు. మెడికల్ షాప్స్, హాస్పిటల్స్ సిబ్బంది ప్రమాద బాధితులకు వెంటనే సహాయం చేయాలని, సమాజంలో బాధ్యతతో



వ్యవహరించాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడమే కాకుండా, ప్రమాద సమయాల్లో మెడికల్ సిబ్బంది పాత్రను స్పష్టంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి , గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, గోదావరిఖని వంటలు ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ సిఐ రాజేశ్వర్ ఎస్సై రమేష్, ఐఎంఏ అధ్యక్షుడు డా. క్యాడా శ్రీనివాస్ గారు, మెడికల్ షాప్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేందర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, సుమారు 200 మంది మెడికల్ షాప్స్ అసోసియేషన్ సభ్యులు, ఐఎంఏ హాస్పిటల్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినాదిన్

- బస్వాపూర్ సర్పంచ్ నజ్మా సుల్తానా ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం





**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 16**
మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంరైతు వేదిక లో గురువారం నాడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించిన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినోదిన్ వెల్దుర్తి మండలం బస్వాపూర్ సర్పంచ్ నజ్మా సుల్తానా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా కంప్యూటర్ రిజెడ్ కాంటాక్ట్ లెన్స్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ అమీర్ మాట్లాడుతూ గురువారం నాడు వెల్దుర్తి మండల కేంద్రం రైతు వేదికలో సుమారుగా 150 నుండి 200 మంది కంటి చూపు వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని కంటి చూపు వైద్య శిబిరంలో ముఖ్యంగా ఆటో డ్రైవర్లకు వాహనదారులకు పలు కంటిచూపు వైద్యాన్ని నిర్వహించడం జరిగిందని స్కూల్ డైవర్స్ ఆటో డ్రైవర్ వాహనదారులు వాహనాలను నడుపుతున్నటువంటి సందర్భంలో కంటిచూపు సరిగా లేకపోవడంతో కూడా ప్రమాదాలకు గురి అవుతున్నార నేఉద్దేశంతోనే ఎవరికి ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా ముందస్తుగా తన మానవత్వాన్ని చాటుకుంటూ మాధవసేవగా భావించిన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహినుద్దీన్ బస్వాపూర్ సర్పంచ్ నజ్మా సుల్తానా వారి అభిప్రాయాల మేరకు గురువారం నాడు వెల్దుర్తి మండల కేంద్రం రైతు వేదికలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని ఈ శిబిరానికి ఎంతో స్పందనగా స్పందించిన కంటిచూపు సరిగా లేని వారు వచ్చి వైద్యాన్ని చేయించుకున్నారని ఇలాంటి వైద్యాలు ఎన్నో చేస్తున్నామని కార్బన్ ఎమ్మెల్యే కౌసర్ బస్వాపూర్ సర్పంచ్ నజ్మా సుల్తానా అభిప్రాయాల మేరకు గురువారం నాడు ఉచిత కంటి పరీక్షలను వెల్దుర్తి రైతు వేదికలో నిర్వహించడం జరిగిందని మునుముందు కూడా ఇలాంటి వైద్య శిబిరాలను వెల్దుర్తి మండల లోని పలు గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని రానున్న 15 రోజులలో మళ్లీ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని గురువారం నాడు కంటి వైద్య శిబిరానికి రాణి వారు 15 రోజుల అనంతరం మళ్లీ వెల్దుర్తి మండలంలోని ఎక్కడ నిర్వహించడం జరుగుతుందో ముందస్తుగానే అందరికీ తెలియజేస్తామని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వెల్దుర్తి పోలీస్ శాఖ సిబ్బంది ఎస్సై రాజు బస్వాపూర్ గ్రామస్తులుసింహం గణేష్ మధు రాజు శేఖరు పాల్గొన్నారు

# వీణవంక మండల భారతీయ జనతా యువ మోర్చా అధ్యక్షుడిగా గండు హరికృష్ణ నియామకం



**కరపత్రం ప్రతినిధి వీణవంక, ఏప్రిల్ 16 :**
భారతీయ జనతా యువ మోర్చా వీణవంక మండల అధ్యక్షుడిగా గండు హరికృష్ణ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్ ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా గండు హరికృష్ణ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జిల్లా మరియు మండల నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవిని గౌరవంగా భావించి పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. యువతను చైతన్యపరుస్తామని పేర్కొంటూ, దేశం మొదట పార్టీ తర్వాత స్వార్థం చివర అనే నినాదంతో ముందుకు సాగుతానని స్పష్టం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో యువతను ఏకం చేసి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, శిక్షణ మరియు సామాజిక సేవలో యువ మోర్చా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు.
సీనియర్ నాయకుల మార్గదర్శకత్వంలో, కార్యకర్తల సమన్వయంతో వీణవంక మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునేలా కృషి చేస్తానని గండు హరికృష్ణ తెలిపారు.

# జగిత్యాల గడ్డ నుంచే కాంగ్రెస్ పతనం ఆరంభం...

- కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





**కరపత్రం ప్రతినిధి మంథని ఏప్రిల్ 16:**
సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి జగిత్యాల గడ్డ నుంచే పతనం ఆరంభం అవుతుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. గురువారం మంథని పట్టణంలోని రాజగృహాలో నియోజకవర్గస్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న జగిత్యాల జిల్లా కేంద్రంలో కేసీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో సభ సక్సెస్‌కు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండున్నర ఏండ్ల కాలంలో ఇటు ప్రజల్లో అటు సొంత పార్టీ నేతల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం కోల్పోయారని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ పార్టీకి జగిత్యాల నుంచే పతకం మొదలైనట్లేనని అన్నారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న క్రమంలో జగిత్యాలలో ఈ నెల 20న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు, ఈ సభకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరవుతున్నట్లు చెప్పారు. జీవన్‌రెడ్డి రాకతో బీఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరినట్లు అయిందని, కాంగ్రెస్ పార్టీని జీవన్‌రెడ్డి వీడటంలో ఆ పార్టీలో అంతర్మథనం మొదలైందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ జగిత్యాల కేంద్రంగా నిర్వహించే బహిరంగ సభకు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, ఆ దిశగా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# బోర్పట్ల గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణం పై చర్య తీసుకోవాలి

-కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు సత్యగౌడ్



**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ముందు కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం బోరపట్ల గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణం ను మూసివేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా.. కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఆశన్న గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, బోరపట్ల కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు సత్య గౌడ్ మాట్లాడుతూ. బోర పట్ల గ్రామంలో గత ఆరు నెలల నుండి సొసైటీకి విరుద్ధంగా అక్రమ కల్లు దుకాణం నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఇదివరకే అనేకసార్లు జిల్లా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని అన్నారు. కొంతమంది ఎక్సైజ్ అధికారులు అవినీతికి పాల్పడి అక్రమ కల్లు దుకాణాలను ప్రోత్సహిస్తున్నారని, వారిపై వెంటనే చర్య తీసుకుని సస్పెండ్ చేయాలని అన్నారు. ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నడుపుతున్న కల్లు దుకాణం పై చర్యలు తీసుకుని బోర పట్ల గ్రామంలో ఉన్న కల్లుగీత సొసైటీ సభ్యులందరికీ న్యాయం చేయాలని వారు కోరారు. ఇక నుండి కల్లుగీత సొసైటీకి ఇలాంటి నష్టం జరగకుండా రక్షణ కల్పించాలని ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ గౌడ్, రవి గౌడ్, వెంకటేశం గౌడ్, బోరుపట్ల గ్రామ సొసైటీ సభ్యులు చిన్న గౌడ్, అంజా గౌడ్, నరసింహగౌడ్, నాగరాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

# అంబేద్కర్ జయంతిని రాజకీయ వేదికగా మార్చారు

## అధికారుల వైఫల్యం, ఎమ్మెల్యే తీరుపై కాంగ్రెస్ నేతల ఘాటు విమర్శలు



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, ఏప్రిల్ 16 :**
కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని పాత మున్సిపల్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి ఉత్సవాలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ జయంతి వంటి గొప్ప కార్యక్రమాన్ని అధికార పార్టీ రాజకీయ ప్రదర్శనగా మార్చారని మండిపడ్డారు.
ప్రభుత్వ పరంగా ఘనంగా నిర్వహించాల్సిన జయంతి ఉత్సవాలు కేవలం పేరుకే నిర్వహించారని, ఉదయం చిన్నపాటి కార్యక్రమం చేసి అధికారులు చేతులు దులుపుకున్నట్లు వ్యవహరించారని ఆరోపించారు. సాయంత్రం ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం ఉద్దేశపూర్వకమని విమర్శించారు.
సాంస్కృతిక కార్యక్రమం పేరుతో నిర్వహించిన సభలో గాయకుడు మిట్టపల్లి సురేందర్‌ను పిలిచి పాటలు పాడించాల్సింది పోయి రాజకీయ ప్రసంగాలకు వేదికగా మార్చారని తీవ్రంగా విమర్శించారు. అంబేద్కర్ ఆశయాలను చర్చించాల్సిన వేదికపై రాజకీయ వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.
తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన సోనియా గాంధీని విస్మరించడం దురుద్దేశపూర్వకమని, చరిత్రను వక్రీకరించే ప్రయత్నమని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా సోనియా గాంధీని కలిసి కృతజ్ఞతలు తెలిపిన విషయం అందరికీ తెలిసిన విషయమని గుర్తు చేశారు.
అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో ప్రజల సమస్యలు, ఆయన ఆశయాలు, సామాజిక న్యాయం గురించి మాట్లాడాల్సింది పోయి హుజూరాబాద్ డంపింగ్ యార్డ్ వంటి ఇతర రాజకీయ అంశాలను ప్రస్తావించడం ద్వారా అసలు ఉద్దేశ్యాన్ని పూర్తిగా పక్కన పెట్టారని మండిపడ్డారు.
ప్రజలకు చెందిన కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులను ఆహ్వానించకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, అధికార పార్టీ తమ ఇష్టానుసారంగా కార్యక్రమాలు నిర్వహించడం సరైంది కాదని విమర్శించారు. ఇది అంబేద్కర్ జయంతి కాదు, అధికార పార్టీ రాజకీయ ప్రదర్శన మాత్రమేనని తీవ్రంగా ధ్వజమెత్తారు.
మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ వ్యవహారశైలి పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రజా కార్యక్రమాలను రాజకీయ వేదికలుగా మార్చడాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఆశయాలను అవమానించే విధంగా కార్యక్రమాలు నిర్వహించడం అసహ్యాకరమని పేర్కొన్నారు.
ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ప్రజల భావాలను గౌరవించాలని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో చందరాజు పొనగంటి విష్ణు వర్ధన్. సలీం పాషా. గూడబ్ సారంగపాణి ఏగిత అశోక్ పుదరి రేణుక శివ గౌడ్. వాసాల రామస్వామి. దేశిని కోటి. కూతాడి తిరుపతి. రాజు దొడ్డే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# మూడు రోజుల పాటు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ బంద్

- రైతులు సరుకులు తీసుకురావద్దని చైర్మన్ పుల్లూరు స్వప్న సదానందం విజ్ఞప్తి

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 16**




కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద వ్యవసాయ మార్కెట్‌గా పేరుగాంచిన జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డు మూడు రోజుల పాటు బంద్ కానుంది. ఈ విషయాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరు స్వప్న సదానందం అధికారికంగా వెల్లడించారు.
వివరాల్లోకి వెళ్తే, ఏప్రిల్ 17, 2026 శుక్రవారం అమావాస్య సందర్భంగా మార్కెట్‌కు ప్రత్యేక సెలవు ప్రకటించారు. అనంతరం ఏప్రిల్ 18, 2026 శనివారం వారాంతపు సెలవు, అలాగే ఏప్రిల్ 19, 2026 ఆదివారం సాధారణ సెలవు ఉండటంతో వరుసగా మూడు రోజుల పాటు మార్కెట్ యార్డు పూర్తిగా మూసివేయబడుతుంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 17 నుండి 19 వరకు మూడు రోజుల పాటు మార్కెట్ కార్యకలాపాలు నిలిపివేయబడతాయి. ఈ సమయంలో ఎటువంటి కొనుగోలు విక్రయాలు జరగవు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకువచ్చిన పక్షంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. తిరిగి ఏప్రిల్ 20, 2026 సోమవారం నుండి మార్కెట్ యార్డు సాధారణంగా ప్రారంభమై, అన్ని లావాదేవీలు యథావిధిగా కొనసాగనున్నాయి. అందువల్ల రైతు సోదరులు ముందస్తుగా ప్రణాళికలు వేసుకుని, పై పేర్కొన్న సెలవు రోజుల్లో తమ పంట ఉత్పత్తులను మార్కెట్ యార్డు కు తరలించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చైర్మన్ పుల్లూరు స్వప్న సదానందం విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా కిసాన్ నగర్ హిందూ సమ్మేళనం.





**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 16**
కరినగర్ నగరంలో కిసాన్ నగర్ బస్తీలో చత్రపతి శివాజీ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం నిర్వహించారు. గోపూజతో కార్యక్రమం అనంతరం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరినగర్ విభాగ ప్రచార ప్రముఖ్ తడి గొప్పుల శంకరయ్య మాట్లాడుతూ సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజన తో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని , హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం , ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యత లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని,. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. హిందూల ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు దేశం, ధర్మం, సంస్కృతి , సాంప్రదాయాల పరిరక్షణ కోసం నిరంతరయంగా పని చేసిందన్నారు. నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్తన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. సంఘం దేశహితం కోసం ఎల్లవేళలా పనిచేస్తూ ముందు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర సేవికాసమితి ప్రాంత శారీరక్ ప్రముక్ లెక్కల రమ మాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. అనంతరం. ముఖ్యఅతిథిగా హాజరైన మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమ్మేళనము కార్యనిర్వహణ సమితి అధ్యక్షుడు పసుల మహిపాల్ ప్రధాన కార్యదర్శి , గాజుల కృష్ణ జన జాగరణ సమితి అధ్యక్షుడు , ఎన్నం శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి మేంగని రాజయ్య , ఉపాధ్యక్షులు ఉప కార్యదర్శులు , బస్తీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.